క్లుప్తంగా

వర్షంలోనూ పింఛన్ల పంపిణీ



ఆస్పత్రిలో డయాలసిస్ రోగికి రూ10 వేలు అందజేస్తున్న వలంటీర్ విజయలక్ష్మి

చిల్లకూరు : వర్షాన్ని సైతం లెక్క చేయకుండా వలంటీర్లు సామాజిక పింఛన్ల పంపిణీలో నిమగ్నమయ్యారు. చింతవరం గ్రామానికి చెందిన వలంటీర్ నాశిన విజయలక్ష్మి ఆదివారం నెల్లూరుకు వెళ్లి అక్కడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొండూరు జ్యోతి, ఉడతా లక్ష్మమ్మకు పింఛన్లు అందజేశారు.

ఘనంగా సత్యనారాయణ స్వామి వ్రతం



సత్యనారాయణస్వామి వ్రతాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని కటకరాజావీధిలో ఉన్న పాండురంగస్వామి ఆలయంలో ఆదివారం సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో దంపతులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కండలేరులో 11.494 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 11.494 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరద కాలువ నుంచి జలాశయానికి 1200 క్యూసెక్కుల నీరు చేరుతోందని తెలిపారు. అదేవిధంగా హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగకు 40 క్యూసెక్కులు, పిన్నేరు వాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ స్లూయిజ్‌కు 135 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పేదలకు దుప్పట్లు, పౌష్టికాహారం పంపిణీ



గిరిజనులకు దుప్పట్లు, పౌష్టికాహారాన్ని అందజేస్తున్న మహేంద్రరెడ్డి

గూడూరు రూరల్ : మండలంలోని నెల్లటూరు గిరిజన కాలనీలో ఉన్న 50 గిరిజన కుటుంబాలకు ఆదివారం జగనన్న సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఊటుకూరు మహేంద్రరెడ్డి దుప్పట్లు, పౌష్టికాహారం అందజేశారు. మహేంద్రరెడ్డి మాట్లాడుతూ వర్షాలకు నిరుపేద గిరిజనులు చలికి అవస్థలు పడుతుండడాన్ని గుర్తించి తమ సంస్థ తరఫున దుప్పట్లు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందజేశామన్నారు. సేవా సమితి సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజేష్, కోటి, సుధ, శీనయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల సంబరాలు

గూడూరు రూరల్ : తెలంగాణలో కాంగ్రెస్ విజయం సాధించడంపై ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ వద్ద బాణసంచా పేల్చి మిఠాయిలు పంచి పెట్టారు. తిరుపతి జిల్లా అధ్యక్షుడు పంటా శ్రీనివాసులురెడ్డి, సర్వేపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి పూల చంద్రశేఖర్, చిల్లకూరు మండల అధ్యక్షుడు వేమయ్య, బండి భాస్కర్‌రెడ్డి, దర్శి నాగభూషణం, తాజుద్దీన్, గోపీ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో అయ్యప్ప గ్రామోత్సవం

వాకాడు : మండల కేంద్రమైన వాకాడులో ఆదివారం అయ్యప్ప గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలో అయ్యప్ప మాల ధరించిన కొందరు భక్తులు మండల కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా గ్రామంలో అయ్యప్ప ఊరేగింపు చేపట్టారు. భారీ అన్నదానం, గణపతి హోమం, అంబళం పూజ, ప్రసాదాల వితరణ చేసినట్టు గురు స్వామి మణి తెలిపారు. అయ్యప్ప భక్తులు రంగులు చల్లుకుని గడప గడపలో భిక్షాటన చేశారు.

వర్షపు నీటి తొలగింపు



కాలువలు తవ్వించి వర్షపు నీటిని బయటకు పంపుతున్న పంచాయతీ కార్యదర్శి రాజా

చిల్లకూరు : మండలంలోని వల్లిపేడు గ్రామ దళితవాడ చుట్టూ వర్షపు నీరు నిలిచింది. దీంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. కొంతమంది వర్షపు నీరు వెళ్లేందుకు వీలులేకుండా కాలువలను పూడ్చడంతోనే ఈ సమస్య నెలకొందని స్థానికులు పంచాయతీ కార్యదర్శి రాజా దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే అక్కడికి చేరుకుని కాలువ తవ్వించి నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు.



నాయుడుపేట టౌన్ : మున్సిపల్ కార్యాలయం సమీపంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



గూడూరు రూరల్ : పంబలేరు పరవళ్లు



బాలాయపల్లి మండలం నేరేడు కాలువ వాగు వద్ద ఎస్ఐ వీరనారాయణ బందోబస్తు

తీరప్రాంతంలో అప్రమత్తం



పెళ్లకూరు: ఉధృతంగా ప్రవహిస్తున్న మామిడి కాలువ

సూళ్లూరుపేట: బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను మహాబలిపురం లేదా చెన్నై–శ్రీహరికోట మధ్య తీరం దాటే అవకాశం ఉందని, సోమ, మంగళవారాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశాల మేరకు అధికారులు అప్రమత్తమయ్యారు. సముద్రతీరం, పులికాట్ సరస్సు తీరప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ముఖ్యంగా సూళ్లూరుపేట, తడ, దొరవారి సత్రం, కోట, వాకాడు, చిల్లకూరు మండలాలకు చెందిన జాలర్లను వేటకు వెళ్లనీకుండా అప్రమత్తం చేశారు. వేటకు వెళ్లిన వారిని తీరానికి రప్పించేందుకు చర్యలు తీసుకున్నారు. కేవీబీపురం మండలంలోని కాళంగి రిజర్వాయర్ నుంచి 2000 వేలు క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండడంతో కాళంగి నది పొంగి ప్రవహిస్తోంది. దీనికితోడు భారీ వర్షాలు కురిస్తే కాళంగినది, పాముల కాలువ వల్ల వరదలొచ్చే అవకాశం వుండడంతో లోతట్టు ప్రాంతంలో వున్న వట్రపాళెం ప్రజలకు ప్రభుత్వ హైస్కూల్‌లోని పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు.

అప్రమత్తంగా ఉండండి

పెళ్లకూరు: భారీ వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని ఎంపీపీ శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ భర్త వెంకటేశ్వర్లు, తహసీల్దార్ రామయ్య, నాయుడుపేట సీఐ సోమయ్య, ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. వారు ఆదివారం లోతట్టు ప్రాంతాలను పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేశారు. కలవకూరు చెక్‌డ్యామ్‌పై వాహనాలు వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. మారుమూల గ్రామాలైన మోదుగులపాళెం, ఊడిపూడి, యడపూడి, కలవకూరు, ముమ్మారెడ్డిగుంట తదితర ప్రాంతాల్లో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ అప్రమత్తం చేస్తున్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు

ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి మండలంలోని పాలచ్చూరు సమీపంలోని మామిడి కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. స్వర్ణముఖి నది ప్రవాహం ఎక్కువగా ఉండడంతో కలవకూరు చెక్‌డ్యామ్ వద్ద రాకపోకలను ఆపేశారు. అలాగే శిరసనంబేడు వరవ కాలువ, చావలి వ్యవసాయ కాలువ, భీమవరం, పాలచ్చూరు సప్లయి చానళ్ల జోరుగా ప్రవహిస్తున్నాయి.

ప్రజలకు అందుబాటులో ఉండండి

ఓజిలి: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు అందుబాటులో ఉండి సహాయక చర్యలు చేపట్టాలని తహసీల్దార్ శివరామసుబ్బయ్య, ఎస్ఐ దారం ఆదిలక్ష్మి తెలిపారు. మానమాల, వెంకటరెడ్డిపాళెం గ్రామాల సమీపంలో చప్టాల వద్ద వర్షపు నీటి ప్రవాహం ఉధృతంగా ఉండడంతో ప్రజలు రాకపోకలు సాగించకుండా ముళ్లకంపలు అడ్డుగా వేసి తలారులను కాపలా ఉంచారు.

ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు

చిల్లకూరు : తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నట్టు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి, చిల్లకూరు మండల ప్రత్యేక అధికారి చెన్నయ్య తెలిపారు. ఆయన ఆదివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఆదివారం రాత్రికి భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున వరద ముంపు ప్రాంతాల వారికి ముందస్తు హెచ్చరికలు జారీ చేశామన్నారు. తిప్పగుంటపాళెం, పారిచెర్లవారిపాళెం వద్ద రోడ్డు పైకి నీరు వస్తే మరో మార్గాన్ని ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సమీక్షలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో వెంకటసూర్యసాయి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయకుమార్, ఎస్ఐ అంజిరెడ్డి పాల్గొన్నారు.

నాయుడుపేట డివిజన్‌లో ముందస్తు చర్యలు

నాయుడుపేట టౌన్ : తుపాను వల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండా నాయుడుపేట పోలీసు డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టినట్టు డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం, నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తున్నందున సీఐలతో పాటు ఎస్ఐలు, ఏఎస్ఐలు, సిబ్బందిని అలెర్ట్ చేశామన్నారు. సముద్ర తీర ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో కలిసి పోలీసులు పనిచేస్తున్నట్లు వివరించారు. వార్డు, గ్రామ మహిళా పోలీసులు ఎప్పటికప్పుడు గ్రామాల్లో పరిస్థితిపై సమాచారం ఇస్తున్నారని తెలిపారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్టు డీఎస్పీ తెలిపారు.

నాయుడుపేటలో కుండపోత వర్షం

నాయుడుపేట టౌన్ :తుపాను ప్రభావంతో నాయుడుపేటలో శనివారం రాత్రి నుంచి కుండపోత వర్షం కురుస్తోంది. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రైల్వే సబ్‌వేలో భారీగా నీరు నిలవడంతో చంద్రబాబునగర్, విన్నమాల, తుమ్మూరు, పండ్లూరు తదితర ప్రాంతాల ప్రజల రాకపోకలకు అంతరాయమేర్పడింది. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు రోడ్లపై నిలిచిన వర్షపు నీటిని పక్కకు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు.

లోతట్టు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

బాలాయపల్లి (డక్కిలి):మండలంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈవోపీఆర్డీ శ్రీనివాసులు సూచించారు. ఆయన ఆదివారం కయ్యూరు చెరువు కలుజు, రామాపురం–కడగుంట బ్రిడ్జి, నిండలి కైవల్యానది బ్రిడ్జి, నేరేడు కాలువ వాగును పరిశీలించారు. అలిమిలి గ్రామ పంచాయతీ అంబలపూడి ఎస్టీ కాలనీ, కాలగం ఎస్సీ కాలనీ ప్రజలు సమీపంలోని పాఠశాల భవనాల్లోకి వెళ్లాలన్నారు. అలాగే తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్ఐ వీరనారాయణ ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఎస్ఐ వీర నారాయణ వెంకటరెడ్డిపల్లి దగ్గర ఉన్న నేరేడు కాలువవాగు, నిండలి కైవల్యా నది బ్రిడ్జి వద్ద సిబ్బందిని బందోబస్తు ఏర్పాటు చేశారు. రాత్రి సమయాల్లో వాహనచోదకులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

గూడూరులో జోరువాన

గూడూరు రూరల్ : తుపాను ప్రభావంతో గూడూరు పట్టణ, రూరల్ ప్రాంతాల్లో ఆదివారం ఉదయం నుంచి భారీ వర్షం కురుస్తూనే ఉంది. గాంధీనగర్‌లోని నాయిబ్రాహ్మణ కాలనీలోని ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరింది. పట్టణ శివారు ప్రాంతంలోని చల్లకాలువ, పంబలేరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పోలీసులు రాకపోకలను నిషేధించారు. వర్షానికి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు బి.లీలారాణి సూచించారు. మిట్టాత్మకూరు పాఠశాలలో ఏర్పాటు చేసిన షెల్టర్‌లో తలదాచుకుంటున్న గిరిజనులను పరామర్శించారు. కండలేరు కాలువను పరిశీలించి అధికారులకు సూచనలిచ్చారు. తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు.

ప్రజను సురక్షిత ప్రాంతాలకు తరలించండి

కోట/చిల్లకూరు: మండలాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. జాయింట్ కలెక్టర్ బాలాజీ, గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ తీరప్రాంత గ్రామాల్లో పర్యటించారు. సిద్ధవరం వద్ద స్వర్ణముఖి చల్లకాలువను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కొత్తపట్నం, గోవిందపల్లి పాళెంలో తుపాను షెల్టర్లలో ఉంటున్న స్థానికులతో మాట్లాడారు. చిల్లకూరు మండలం తిప్పగుంటపాళెం సమీపంలో ఉన్న ఉప్పుటేరును, పారిచెర్లవారిపాళెం వద్ద ఉన్న చప్టాను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కోట తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీవో భవాని, చిల్లకూరు మండల ప్రత్యేక అధికారి చెన్నయ్య, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో వెంకటసూర్యసాయి, రూరల్ సీఐ దశరథ రామారావు, ఎస్ఐ అంజిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు సనత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

సైదాపురంలో..

సైదాపురం: భారీ వర్షాలు కురుస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎస్.శ్రీనివాసులు ఆదేశించారు. ఆయన ఆదివారం మండలంలోని జోగిపల్లి, ఊటుకూరు, చాగణం, అనంతమడుగు గ్రామాలను పరిశీలించి లోతట్టు ప్రాంతాల్లో ఉంటున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని వీఆర్వోలకు సూచించారు. పిన్నేరు, మాలేరు, కైవల్యా నదుల వద్ద ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట: మండలంలో భారీవర్షం కురవడంతో తహసీల్దార్ మాగర్ల రాజేంద్ర ఆదివారం వరద ముంపు ప్రాంతాలైన పండ్లూరు, వెంగమాంబపురం, అయ్యప్పరెడ్డిపాళెం, కల్లిపేడు, చిలమత్తూరు, అన్నమేడు, మర్లపల్లి, వేముగుంటపాళెం, కాలవగట్టు, మఢపలం గ్రామాల వద్ద కరకట్టలను, మామాడి కాలువ ప్రవాహాన్ని పరిశీలించారు.

సూళ్లూరుపేటలో 35.5 మిమీ వర్షం

సూళ్లూరుపేట రూరల్ : మండలంలో ఆదివారం 35.5 మీమీల వర్షపాతం నమోదైనట్టు తహసీల్దార్ కన్నంబాకం రవికుమార్ తెలిపారు. తీరప్రాంతాలైన దామరాయి, కొరిడి, కడప్ర పంచాయతీల్లో పరిశీలనకు వ్యవసాయ అధికారి కవిత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉమామహేశ్వరి, ఎంఈవో శ్రీనయ్యను నియమించినట్లు తెలిపారు.

దక్కిలిలో...

దక్కిలి: మండలంలో శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు 36.2 మిమీ వర్షపాతం నమోదైనట్టు తహసీల్దార్ రమేష్‌బాబు తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. వెంగమనాయుడుపల్లి బ్రిడ్జి వద్ద రాకపోకలను నిలిపివేశామన్నారు. డక్కిలి జెడ్పీ హైస్కూల్, దగ్గవోలు పంచాయతీ భవనంలో పునరావస కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. వాగులు వంకలు వద్ద ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఎస్ఐ నాగరాజు తెలిపారు. ఆయన వెంగమనాయుడుపల్లి బ్రిడ్జి, మాటుమడుగు చప్టా, లింగసముద్రం కోండరు వాగు, సంగనపల్లి కలుజు, మార్లగుంట గిరిజన కాలనీను పరిశీలించారు.

రాపూరులో..

రాపూరు: మండలంలోని రాపూరు, పెంచలకోన తదితర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం నుంచి వర్షం కురుస్తూనే ఉంది. తీవ్ర చలిగాలులతో పాటు, వర్షం కురవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ముంపు ప్రాంతాల్లో అధికారుల పర్యటన

తడ: మండలంలోని ముంపు ప్రాంతాల్లో ఆదివారం సైక్లోన్ స్పెషల్ అధికారి శ్రీనివాసులురెడ్డి, మండల అధికారులతో కలిసి పర్యటించారు. ప్రజలను అత్యవసర పరిస్థితుల్లో పునరావాస ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకున్నారు. తహసీల్దార్ కటారి జయజయరావు, ఎంపీడీవో ఆమోసుబాబు, ఇరిగేషన్ ఇంజినీరు రమేష్, హౌసింగ్ ఏఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

వెంకటగిరిలో 26.4 మి.మీల వర్షం

వెంకటగిరి రూరల్ : మండలంలో ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు 26.4 మి.మీల వర్షపాతం నమోదైనట్టు తహసీల్దార్ పద్మావతి తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షితంగా ఉంచేందుకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ఎంపీడీవో విజయలక్ష్మి పాల్గొన్నారు.

తుపాను సహాయక చర్యలపై సమీక్ష



నాయుడుపేట టౌన్ : వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడకుండా అప్రమత్తంగా ఉండి సహాయక చర్యలు చేపట్టాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అధికారులను ఆదేశించారు. ఆయన ఆదివారం నాయుడుపేటలోని తన క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. తీర ప్రాంతాల ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు సహాయక చర్యలు చేపట్టాలని తెలిపారు. స్వర్ణముఖి, కాళంగి నదీ పరివాహక ప్రాంతాలతోపాటు వాగులు, వంకల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జాలర్లు వేటకు వెళ్లకుండా చూడాలని సూచించారు. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, ఆరోగ్య ఉప కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు సత్వరం సేవలు అందించాలన్నారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తమ పరిధిలోని పరిస్థితిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు.



సూళ్లూరుపేట అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీవో ఆర్.చంద్రముని



ఓజిలి : వెంకటరెడ్డిపాళెం రోడ్డు వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్ఐ



గూడూరు రూరల్ : గిరిజనులను పరామర్శిస్తున్న తహసీల్దార్ లీలారాణి



చిల్లకూరు: ఉప్పటేరు వద్ద అధికారులకు సూచనలిస్తున్న జేసీ బాలాజీ



నాయుడుపేట : పండ్లూరు మామిడి కాలువను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు



చిల్లకూరు: గుమ్మళ్లదిబ్బ వద్ద జాలర్లకు సూచనలు ఇస్తున్న అధికారులు

పొంగిన కాళంగి నది

దొరవారిసత్రం : భారీ వర్షాలకు కాళంగి నది పరవళ్లు తొక్కుతోంది. దీంతో తనియాలి, బూదూరు, కమ్మకండ్రిగ, కొత్తకండ్రిగ తదితర గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. తనియాలి సమీపంలో కాళంగి నదిపై ఉన్న బ్రిడ్జి వరద నీటిలో అధికారులు, పోలీసు సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేసి రాకపోకలను నిషేధించారు. వెదురుపట్టు, పూలతోట మార్గాల్లో ఉన్న పాలకాలువ, కన్నాకాలువ ప్రవహిస్తున్నాయి. పంట పొలాలు నీట మునిగాయి. తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డి, ఎంపీడీవో రఘురామయ్య, ఎస్ఐ తిరుమలరావు, ఇరిగేషన్ ఏఈ కస్తూరయ్య ప్రజలను అప్రమత్తం చేశారు.



దొరవారిసత్రం : వర్షపు నీటితో చెరువులా కనిపిస్తున్న అక్కరపాక సమీపంలోని పొలాలు

ఘనంగా అయ్యప్పస్వామి పడి పూజోత్సవం

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని రాఘవేంద్ర భవన్‌లో ఆదివారం అయ్యప్పస్వామి పడిపూజోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా రూరల్ అధ్యక్షుడు కనమర్లపూడి సుబ్రమణ్యం, జ్యోతిరాణి, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారణ చేసిన భక్తులకు పాద పూజ చేసి దుస్తులు పంపిణీ చేశారు. పద్దెనిమిది మెట్లు ఏర్పాటు చేసి పడి పూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాదాలు వడ్డించారు. కార్యక్రమంలో కే రమేష్ బాబు, వెంకటేశ్వరరావు, సురేంద్రనాథ్‌గుప్త, అనూష, భగవాన్ అయ్యప్పస్వామి సేవా సంఘం అధ్యక్షుడు కామిరెడ్డి రాజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



అయ్యప్పస్వామి పడి పూజోత్సవంలో పాల్గొన్న భక్తులు, నిర్వాహకులు

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

గూడూరు రూరల్ : దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణంలోని షాదీమంజిల్‌లో ఆదివారం రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వారికి ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొన్న పారా స్పోర్ట్స్ క్రీడాకారులను సన్మానించారు. ఎస్ఎల్ఎన్.స్వామి, దాతలు అద్దంకి లక్ష్మి, త్రివిక్రమరావు, సుధీర్, రెడ్ సంస్థ అధ్యక్షుడు జానా సుధీర్, శ్రీధర్, రామలింగం, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారుడు అవినాష్‌ను సన్మానిస్తున్న కమిషనర్, రెడ్ సంస్థ ప్రతినిధులు

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

వెంకటగిరి రూరల్ : అర్హతే ప్రామాణికంగా ప్రజలకు పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం వెంకటగిరి పట్టణంలోని 10వ వార్డు మనులాలపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షంలోనే తడుస్తూ ప్రతి ఇంటికీ వెళ్లి వారు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నాలుగున్నరేళ్లలో ప్రతి ఇంటికీ రూ.లక్షల్లో లబ్ధి కలిగిందని తెలిపారు. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అందిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శివయ్య, వహిద, సుబ్బారావు, న్యాయవాది ఎల్ కోటేశ్వరరావు, నేతలు రొంటాల చిన్నా, యస్థాని, తోట గణేష్‌రెడ్డి, పేజీరాజ్ తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

లోతట్టు ప్రాంతాల పరిశీలన

వెంకటగిరి(సైదాపురం) : తుపాను కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. ఆయన ఆదివారం అధికారులతో కలిసి పాళెంకోట చప్టా వద్దకు చేరుకున్నారు. యంత్రాలతో వరద నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సహాయం అందించేందుకు ప్రత్యేక హెల్ప్‌లైన్, హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, మండల కన్వీనర్ కాల్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నేతలు వేణురెడ్డి, గణేష్‌రెడ్డి, పేజీరాజ్, ఎంపీడీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి